# చూడండత్తయ్యా...

కుసుమ అప్పటివరకూ హాల్లోనే కూర్చుని, లోపలికి వెళ్ళింది. ఇంతలో ట్రింగుమంటూ కాలింగ్ బెల్...

ఇంత ఆలస్యం అయిందేం? ఇప్పటి వరకూ చూసి చూసి, ఇప్పుడే లోపలికి వెళ్ళాను అంది కుసుమ తలుపు తెరుస్తూ. ఏమీ లేదు - చిన్నప్పటి స్నేహితుడొకడు వస్తేనూ... కబుర్లలో పడి ఆలస్యమయింది...

అవునూ... రేపు పండుగ కదా! అమ్మ వస్తానంది. రాలేదా? అడిగాడు శేఖర్. బావగారు ఫోన్ చేసారు. అత్తయ్యను భోజనాలయ్యాక బస్సు ఎక్కిస్తానన్నారు. వంట చెయ్యొద్దని చెప్పారు... కుసుమ చెబుతూండగానే సరేలే, ఇంకా టైముందిగా, వస్తాదిలే; నేను స్నానానికి వెళ్తున్నానంటూ బాత్‌రూమ్‌లోకి దూరాడు శేఖర్.

ఎప్పుడూ లేనిది ఎందుకింత కంగారు?...



అని కుసుమ ఆలోచిస్తూండగానే, బాత్‌రూమ్ లోంచి వస్తూ "కుసుమా... భోజనం వడ్డించు" అన్నాడు శేఖర్. అప్పుడేనా అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది కుసుమ. ఏమిటలా చూస్తున్నావ్? అన్నట్టు నీకు చెప్పనేలేదు కదూ... చిన్నప్పటి ఫ్రెండొచ్చాడు. వాడు రేపే తిరిగి వెళ్ళిపోతాడట. నాకు సినిమా పార్టనర్...

రఘు? ప్రశ్నించింది కుసుమ.

అవునోయ్. రఘునే. నీకు బాగానే గుర్తుందే! మన పెళ్ళికి రాలేకపోయాడు... అన్నాడు శేఖర్. మరి ఇంటికి తీసుకురాలేక పోయారూ... అంది కుసుమ. తప్పకుండా... రేపు బ్రేక్‌ఫాస్ట్ ఇక్కడే వాడికి...

కుసుమ ఇద్దరికీ భోజనం వడ్డించి, తను తినకుండా శేఖర్ వంకే చూస్తోంది. మాట్లాడకుండా లాగించేస్తున్నాడు శేఖర్. కుసుమ తినకపోవడంతో అనుమానం వచ్చి "ఏమిటోయ్ అలా చూస్తున్నావ్? తిను" అన్నాడు శేఖర్. ఆ... అని, నోట్లో ముద్ద పెట్టుకొంటూ "కూరెలాగుందండీ" అడిగింది కుసుమ. వినబడనట్టు ఆ... అన్నాడు శేఖర్. "అబ్బా... కూరెలాగుంది మహా ప్రభో" అని కాస్త బిగ్గరగా అంది కుసుమ.

"ఓ... అదా... నీ మొహం లాగుంది" అని మళ్ళీ ఫుడ్ లాగించేస్తున్నాడు శేఖర్. కుసుమ ముఖం చిన్నబోయింది. ఎప్పుడూ ఇంతే. అడిగినప్పుడల్లా ఇదే వరస. అందుకే నాలుగు రోజుల నుంచి అడగడం మానేసాను. అని లోలోపల సణుగుకొంటూ తింటోంది. ఎప్పటి లాగా కాకుండా ముందే లేచి, బట్టలు వేసుకొని. "వెళ్ళొస్తా కుసుమా... తలుపు వేసుకో. అమ్మ వస్తే చూసుకో. విషయాలు ఉదయాన్నే మాట్లాడుకుందామని చెప్పు"... అని బయలుదేరాడు శేఖర్.

సెకండ్ షో సినిమా అయ్యాక వచ్చి తలుపు కొట్టాడు. తలుపు తీస్తున్న కుసుమను "అమ్మ వచ్చింది కదూ..." అంటూనే గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని, మంచం మీద పడ్డాడు శేఖర్.

తెల్లవారింది. శేఖర్, కుసుమల పెళ్ళయ్యాక తొలిపండుగ "విజయదశమి". అందుకే పెద్ద కోడలు పట్టుపట్టినా నచ్చచెప్పి మరీ వచ్చింది శాంతమ్మ. పొద్దుటి నుంచీ ఒకటే హడావుడి. తన కోసం తెచ్చిన కొత్త చీర, బంగారపు చెవిదుద్దులు అత్తయ్యకి చూపించి, బాగున్నాయంటే మురిసిపోయింది కుసుమ. అత్తయ్య కోసం తను కొన్న చీర కూడా చూపించింది.

రోజూ కంటే కాస్తంత ముందే నిద్ర లేచాడు శేఖర్. బాత్‌రూమ్‌కి వెళ్తూనే, "ఏయ్ పెంకి పిల్లా వంటకాలేమిటి?" అంటూ అమ్మ ఉన్న సంగతి గుర్తొచ్చి, నాలుక కరుచుకున్నాడు. విననట్టు శేఖర్ వంక చూస్తూ కిచెన్‌లోకి వెళ్ళిపోయింది కుసుమ. కొంపతీసి కోపంగానీ వచ్చిందా అన్న ఆలోచనలో పడ్డాడు శేఖర్. కాసేపటికి కాఫీ తెచ్చి చిరునవ్వుతో అందించింది కుసుమ. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాడు.

"ఏమండోయ్ శ్రీమతిగారూ! పండుగ వంటకాలేమిటి?" మళ్ళీ అడిగాడు. "ముందుగా చెబితే అందులో బిగువుపోతాది సార్, తినే వరకూ సస్పెన్స్..." అని వంటగదివైపు దారి తీసింది కుసుమ.

నిన్నే... ఆగు. అంటూ ఎగురుతున్న కొం

**ఎస్.ఆర్. పృథ్వి**

గును పట్టుకోబోయేసరికి "ఏరా శేఖర్ నిద్ర లేచి ఎంతసేపయింది?", వంటగదిలోంచి వస్తూ శాంతమ్మ అడిగింది. లేచి చాలా సేపయిందమ్మా. అక్కడి విశేషాలేమిటి? అన్నయ్య, వదినా బాగున్నారా? పిల్లలెలాగున్నారు? ప్రశ్నల వర్షం కురిపించాడు.

ప్రత్యేకించి విశేషాలేముంటాయిరా. మీ వదినకి కాస్త నలతగా ఉంది అంతే. అన్నయ్య మరి కొన్నాళ్ళక్కడే ఉండమన్నాడు. మీ పెళ్ళయ్యాక తొలి పండగ కదా! నాలుగు రోజులుండి వస్తానని వచ్చాను. ఏరా అబ్బాయ్. ఎలాగుంది మీ సంసారం? ఒక దశలో మీ మామయ్య కాదన్నా, నువ్వే కావాలని పట్టు పట్టింది కుసుమ. మేనమామ కూతురే కదా అని అనుకోకుండా, దాని మనసు నొప్పించకుండా చూసుకోరా... ఇంకా ఏదో చెప్పబోతూండగా, అత్తయ్యా... అన్న కుసుమ కేక విని, వంటగదివైపు నడిచింది శాంతమ్మ.

ఉదయం తొమ్మిది కావస్తోంది. రఘు రావడాన్ని గమనించిన శేఖర్ "రా... రఘూ" అంటూ లోనికి ఆహ్వానించాడు. ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. ఇంతలో శాంతమ్మ ఎవరా? అని హాల్లోకి వచ్చింది. "నమస్కారం అమ్మా... ఎలా గున్నారు?" రఘు పలకరించాడు. నాకేం నాయనా! బాగానే ఉన్నాను. "అమ్మ, నాన్నా కులాసానా" ప్రశ్నించింది శాంతమ్మ.


ఇంతలో కుసుమ టిఫిన్ రడీ చేసి "ఏమండీ... టిఫిన్ చేద్దురుగాని రండి" పిలిచింది. "రారా... టిఫిన్ చేస్తూ మాట్లాడుకుందాం" అని రఘుని తీసుకుని డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చాడు శేఖర్. బాగున్నారా అన్నయ్యగారూ!" కుసుమ పలకరించింది. బాగానే ఉన్నానమ్మా – మీ పెళ్ళికి రాలేకపోయాను. అలాగని నా పెళ్ళికి రావడం మానేయకండి... నవ్వుతూ అన్నాడు రఘు. "భలేవారే... టిఫిన్ చేయండన్నయ్యా" అంది కుసుమ. టిఫిన్ తినడం పూర్తి కాగానే కాఫీ తెచ్చి యిచ్చింది. "షుగర్ సరిపోయిందా... అన్నయ్యా" అడిగింది కుసుమ. "కాఫీ వండర్‌ఫుల్ అమ్మా" అన్నాడు రఘు. మరి టిఫిన్... ప్రశ్నించింది కుసుమ. మా అమ్మలాగే చేసావమ్మా... అన్నాడు.

మీరేమీ మాట్లాడరే... శేఖర్ వంక చూస్తూ అడిగింది. నవ్వుతూ "నా మొహంలాగున్నాయి" అన్నాడు. వెంటనే ముఖం తిప్పుకుని వంటగదిలోకి వెళ్ళిపోయింది. కుసుమ, శాంతమ్మ పిండి వంటలు చేయడంలో లీనమయిపోయారు. కాస్సేపు కబుర్లు చెప్పుకున్నాక, రఘు వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం భోజనాల సమయం అయిందిి. పూజా కార్యక్రమాలు ముగిసాయి. విజయ దశమి స్పెషల్ వంటకాలతో అన్నీ సిద్ధం చేసింది కుసుమ. అత్తయ్యకి, శేఖర్‌కీ వడ్డిస్తూంటే ఉన్నది ముగ్గురమేగా... నువ్వు కూడా వడ్డించుకో కుసుమా... అంది శాంతమ్మ.

"ఐటమ్స్ ఏమిటో" కుసుమ ముఖంలోకి చూస్తూ అడిగాడు శేఖర్. తినబోతూ తొందరెందుకురా అంది శాంతమ్మ. కుసుమ ముగ్గురికీ అన్ని ఐటమ్స్ వడ్డించింది. బూరెలు, గారెలు, అందులోకి కొబ్బరి చెట్నీ, బొబ్బట్లు, పులిహోర, చక్రపొంగలి – అన్నీ శేఖర్‌కి ఇష్టమైనవే. వడ్డిస్తూనే వంటకాలెలాగున్నాయో సిన్సియర్‌గా చెప్పాలి... శేఖర్ కళ్ళల్లోకి చూస్తూ అంది కుసుమ.

ముగ్గురి భోజనం ప్రారంభమయింది. ఒక్కో ఐటమ్ టేస్ట్ చేస్తూంటే ఆతృతగా శేఖర్ వంక చూస్తోంది కుసుమ. శేఖర్ మాత్రం ఏమీ




మాట్లాడకుండా తినేస్తున్నాడు. భోజనం చేస్తూనే మధ్య మధ్య ఎలాగున్నాయన్నట్టు కళ్ళతో ప్రశ్నిస్తోంది కుసుమ. చెబుతా... తొందరేమిటన్నట్టు బుర్రాడిస్తూ తినేస్తున్నాడు శేఖర్. భోజనాలు పూర్తయ్యాయి. శేఖర్ వాష్‌బేసిన్ దగ్గర చేతులు కడుగుకొంటున్నాడు. ఓపిక నశించిన స్వరంతో "వంటకాలెలాగున్నాయో చెప్పనేలేదు" అంది కుసుమ. "ఏం చెప్పమంటావ్, అన్నీ నీ మొహంలా ఉన్నాయి..." అన్నాడు శేఖర్.

"పెళ్ళయిన దగ్గర నుంచి ఇదే వరస అత్తమ్మా. ఎప్పుడు అడిగినా నీ మొహంలాగుందనో. నా మొహంలాగుందనో... ఒక్కసారైనా సరిగా చెప్తేనా..." అంది కుసుమ. ఇక ఏడుపు ఒకటే తక్కువ. అది గమనించిన శేఖర్ అసలు విషయానికి వచ్చేసాడు.

అవునమ్మా ఈ రోజు వంటకాలన్నీ కుసుమ మొహంలాగున్నాయమ్మా. ఆ ముఖం నాకెంతో నచ్చబట్టే కదా పెళ్ళి చేసుకుంది? నాకిష్టమైన ఆ ముఖంతో పోలిస్తే అర్థం చేసుకోవడం మానేసి, నన్ను తప్పు పడితే ఎలా? ఇక నా ముఖం విషయానికి వస్తే... నాది కూడా కాస్తో, కూస్తో అందమైందే కదా. కుసుమ ఇష్టపడిందే కదా... అందుకని కొన్నిసార్లు నా ముఖంతో కూడా పోల్చాను... అన్నాడు శేఖర్.

ఏడవబోతున్న కుసుమ ముఖంలో ఒక్కసారిగా నవ్వు విచ్చుకుంది. తాను ఊహించుకున్న దానికి భిన్నంగా శేఖర్ మనసులో మాట వినేసరికి, హృదయం లోంచి పొంగుకొచ్చిన ఆనందాన్ని తట్టుకోలేక నవ్వుకొంటూ బెడ్ రూమ్‌వైపు పరుగు తీసింది కుసుమ. అలా నిండుమనసుతో నవ్వుతూంటే మరింత అందంగా కనిపించింది శేఖర్‌కి. ఆమె వెనుకనే నడుస్తూ... సారీ రా... మనది కొత్త జంట కదా... ఏదో థ్రిల్ కోసం అలా... నన్ను భరించినందుకు థేంక్స్ అన్నాడు. కుసుమ, శేఖర్ కళ్ళల్లోకి చూస్తూ, సన్నగా నవ్వింది.